
మహాలక్ష్మీ అలంకరణలో విజయదుర్గ

ప్రత్యేక అలంకరణ.. అభిషేకాలు

దిల్‌సుఖ్‌నగర్/సైదాబాద్: దేవీ శరన్నవ రాత్రి వేడుకలను మలక్‌పేట /ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. కాలనీలు, బస్తీల్లోని అమ్మవారి ఆలయాలు, మండపాల్లో అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నారు. వివిధ డిజైన్లతో రూపొందించిన మండపాలు రంగు రంగుల విద్యుత్ దీపాలతో భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో 6వ రోజైన శుక్రవారం సైదాబాద్ మాతా మైదాన్‌లోని విజయదుర్గ అమ్మవారు శ్రీమహాలక్ష్మీ అలంకరణలో, జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గ సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కొత్తపేటలో .... పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు


జీఎస్ఐలో.. పూజల్లో పాల్గొన్న ఏడీజీ హెచ్‌ఓడీ వెంకటేశ్వర్‌రావు తదితరులు


కొత్తపేటలో పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇన్‌ఛార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్ తదితరులు

ధర్మ సమాజ పార్టీ కార్యాలయం ప్రారంభం

నాగోలు: తెలంగాణలోని 10 శాతం లేని అగ్ర కులాల ఆధిపత్యం పై 90 శాతం ఉన్న అణగారిన వర్గాల ధర్మ సమాజ పార్టీ ధర్మ యుద్ధం మొదలైందని ధర్మసమాజ్ పార్టీ(డీఎస్‌పీ) రాష్ట్ర కార్యదర్శి బరిగల దుర్గాప్రసాద్ మహారాజు అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలో ధర్మ సమాజ్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ విశారదన్ మహరాజ్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటైన ధర్మ సమాజ్ పార్టీ తరపున 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మత మైనార్టీలను రాజకీయంగా ముందు వరుసలో నిలిపేందుకు ఎన్నికల యుద్ధం ప్రారంభమైందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 119 నియోజకవర్గాలలో అభ్యర్థులను నిలబెడతామన్నారు. ఇందులో భాగంగానే మొదటి విడతగా 53 మందిని అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గ ధర్మ సమాజ పార్టీ అభ్యర్థిగా ఇరిగి హనుమంతు ప్రకటించారు. పార్టీ సికింద్రాబాద్ కన్వీనర్ మేడి కార్తీక్ మహారాజు, గోషామహల్ నియోజకవర్గ అభ్యర్థి సింగారం లింగస్వామి, హైదరాబాద్ జిల్లా ధర్మ సమాజ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరుకల కులస్తులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే

లింగోజిగూడ: ఎరుకల కులస్తులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, వారి సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం లింగోజిగూడ డివిజన్‌లోని అల్తాఫ్‌నగర్‌లో జరిగిన ఎరుకల కులస్తుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం నాయకులు మాట్లాడుతూ, వచ్చే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి మరోసారి సుధీర్‌రెడ్డిని గెలిపించుకుంటామన్నారు. ఈ మేరకు వారు చేసిన తీర్మానం కాపీని ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, రాకేష్‌ఠాగూర్, లక్ష్మీప్రసన్న, బాస్కర్‌గంగపుత్ర, ఆశీష్, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పద్మశాలీయుల సంక్షేమానికి కృషి

మన్సూరాబాద్: పద్మశాలీయుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్ హిమపురి గార్డెన్స్‌లో శుక్రవారం నిర్వహించిన పద్మశాలీయుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. రాపోలు తిరుమలేష్, రుద్రయాదగిరి, చెరుకు స్వామి తదితరులు పాల్గొన్నారు.

లైసెన్సింగ్ బోర్డు సభ్యుడిగా బెనర్జీ నియామకం

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడిగా నేమాల బెనర్జీ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ తనిఖీ ప్రధాన అధికారి ఎస్.శ్రీనివాసరావు చేతులు మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఏడాది క్రితం బోర్డు సభ్యుడి పోస్టు కోసం నామినేషన్ దాఖలు చేశారు. రాజకీయ కారణాల వల్ల నామినేషన్ వేసిన వ్యక్తిని కాకుండా మరో వ్యక్తికి నియామకం జరిగింది. దీంతో సదరు సభ్యుడు కోర్టును ఆశ్రయించారు. ఇది చట్ట విరుద్ధమని తేల్చి చెప్పింది. కోర్టు ఆదేశాల మేరకు ఇంధన వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి బెనర్జీని బోర్డు సభ్యుడిగా ఎంపిక చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన తెలంగాణ ఎలక్ట్రికల్ బి గ్రేడ్ కాంట్రాక్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నారు. తాజాగా బోర్డు సభ్యుడిగా నియమితులవడంపై సన్నిహితులు, తోటి కార్మికులు, హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అక్షయ ట్రస్ట్ అన్నప్రసాద శాల మొదటి అంతస్తు ప్రారంభం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మీ ఆలయంలో శుక్రవారం అక్షయ ట్రస్ట్ అన్నప్రసాద శాల మొదటి అందస్తును శ్రీభాష్యాకార సిద్ధాంత పీఠాధిపతులు శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, అక్షయ ట్రస్ట్ కార్యదర్శి సుధాకర్ గుప్తా పాల్గొన్నారు.



ఎక్సైజ్ దాడుల్లో 32 కేసుల నమోదు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఈనెల 9 వ తేదీ నుంచి శుక్రవారం వరకూ విస్తృతంగా దాడులు చేసి 32 కేసులను నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశామని సరూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జి శ్రీనివాస్ రావు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి డివిజన్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్, అసిస్టెంట్ కమిషనర్ చంద్రయ్య ఆదేశాల మేరకు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవీందర్ రావు సూచనల మేరకు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు నేతృత్వంలో ఈ దాడులు చేశారు. దాడుల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని, గోవా నుంచి తెచ్చిన లిక్కర్ విక్రయిస్తున్న వారిని, మద్యం షాపులో ఇతర మద్యం అమ్మకాలు చేస్తున్న 16 మంది అరెస్టు చేశారు. వీరి నుంచి 2681 లీటర్ల లిక్కర్, 2848 లీటర్ల బీరు, 500 లీటర్ల కల్లు, 132 లీటర్ల గోవా లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. అధికారులు స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ. 65,09,000 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడులలో సబ్ ఇన్‌స్పెక్టర్లు ముజాహిద్ సుతారి, ఇబ్రహీం పాషా పాల్గొన్నారు.